క్లుప్తంగా

రేపు చందోలులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో ఈ నెల 20న ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద నవరత్నాలు లబ్ధిదారుల పేర్ల బోర్డును ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటారని తెలిపారు.

భాష్యం విద్యార్థుల ప్రతిభ



రేపల్లె: సైన్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ 2023–24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ జనరల్ నాలెడ్జ్ ఒలింపియాడ్ పట్టణంలో భాష్యం స్కూలు విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. 86 మంది విద్యార్థులు పాల్గొనగా 17 మంది జోనల్ స్థాయిలో గోల్డ్ మెడల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ సాధించారు. ఈ సందర్భంగా స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థులకు శనివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో జోనల్ అధికారి హృదయ్‌రాజ్, హెచ్‌ఎం లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయులు బాజీ, వెంకటేశ్వర్లు, వసుంధర, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తిక వన సమారాధన

రేపల్లె: పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో వేంచేసియున్న శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శ్రీ దత్తాత్రేయ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సమాఖ్య కోశాధికారి రొంపిచర్ల విజయసారథి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణులు పాల్గొనాలని పేర్కొన్నారు.

9న మెగా లోక్‌అదాలత్



రేపల్లె: మెగా లోక్ అదాలత్‌లలో అత్యధిక కేసులు పరిష్కారించి, కక్షిదారులకు న్యాయం జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కోర్టు భవన్‌లో శనివారం పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 9న శనివారం మెగా లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్టు పరిధిలోని కక్షిదారుల కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ నజీర్ బేగ్, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో యడ్లపల్లి విద్యార్థుల ప్రతిభ



చుండూరు(భట్టిప్రోలు):గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఈ నెల 17న జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో చుండూరు మండలం యడ్లపల్లి ఆలపాటి వెంకట్రామయ్య జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 23 విభాగాల్లో అద్వితీయమైన ప్రతిభ కనపరచారు. జిల్లా స్థాయి చాంపియన్‌షిప్ సాధించారు. పి.రాము, షేక్ రియాజ్‌ఖాన్, ఇ.పూజితరెడ్డి, టి.మేఘన, జి.మోనాలిక, డి.ప్రియాంక, వి.ఉష్పశ్రీ, షేక్ ఖాజా, షేక్ నిజాముద్దీన్, పి.కల్యాణ్ 23 విభాగాల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ వేమూరి శరత్‌బాబును శనివారం ప్రధానోపాధ్యాయుడు కుర్రా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

9 వరకు ఓటు నమోదుకు అవకాశం



రేపల్లె రూరల్: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనదని తహసీల్దారు మల్లికార్జునరావు అన్నారు. పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సమాజంలో నిజాయితీ పరులైన నాయకులను ఎన్నుకునేందుకు ఓటు హక్కు ఎంతగానో దోహదపడుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండటంతో పాటు దాని ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. డిసెంబర్ 9 వరకు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, ఎస్ఐ హరిబాబు, కళాశాలఅధ్యాపకులు పాల్గొన్నారు.

విజ్ఞానం వెల్లివిరిసేలా వారోత్సవాలు



చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు



కొల్లూరులో చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

- గ్రంథాలయాల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు
- పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేలా విజ్ఞాన కార్యక్రమాలు

చుండూరు(భట్టిప్రోలు): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని చుండూరు మండలం యడ్లపల్లిలోని గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీ రామ అప్పర్ ప్రైమరి స్కూల్‌లో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్ వంటి ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు గ్రంథాలయాధికారిణి బి.గిరిజాసుందరి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

భట్టిప్రోలు: మాటూరు రామారావు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి కలపాల సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ.. వివిధ పాఠశాలలకు చెందిన 45 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీఎస్(బీఆర్) స్కూల్ ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, ఉర్దూ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఖలీలుల్లా, ఏఈఎస్(డీఎస్) స్కూల్ టీచర్ అమ్మిశెట్టి నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రోత్సాహం అందించాలి

కొల్లూరు: విద్యార్థులు ఏ అంశంలో అమితాశక్తితో ఉన్నారో గమనించి, అందులో వారు రాణించేలా తల్లిదండ్రులతో పాటు, ఉపాధ్యాయులు పోత్రాహం అందించాలని కొల్లూరు సబ్ రిజిస్ట్రార్ షేక్ పర్వీన్ అన్నారు. శనివారం కొల్లూరు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలంటే పుస్తక పఠనం ఎంతో వసరమని వివరించారు.పోటీలలో176 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం గ్రంథాలయం నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు వై.రాంబాబు,జి. కనకదుర్గ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కర్లపాలెం: విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్విజ్, డిబేట్, ఆటల పోటీలు దోహదపడతాయని కర్లపాలెం శాఖ గ్రంథాలయాధికారి టీవీ రమణమ్మ తెలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం విద్యార్థులకు డిబేట్, క్విజ్, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమకు అనుకూల సమయంలో గ్రంథాలయాలకు వచ్చి తమకు ఇష్టమైన బుక్స్ చదువుకుని జనరల్ నాలెడ్జ్ పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్, ఉదయ్‌కుమార్, సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్

వేమూరు: అధికారులందరూ సమన్వంతో పనిచేసి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాలని ఎంపీపీ యల్లమాటి మోహన్ అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. అధికారులు తమ శాఖల పనితీరును వివరించారు. ఎంఈఓ వెంకటేశ్వరావు మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో డిజిటల్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. డ్రైయినేజ్ ఇంజినీరు రాంబాబు మాట్లాడుతూ పంట కాల్వల్లో తూటి కాడ తొలగింపునకు ప్రభుత్వం అంచనాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనురాధ మాట్లాడుతూ జగనన్న కాలనీల గృహ నిర్మాణంలో వెనుకబడి ఉన్నట్లు తెలిపారు. అధికారులందరూ గృహ నిర్మాణాలకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీ షేక్ బాజీ, దాసరి శివ పార్వతీ, కో–ఆప్షన్ మెంబరు తలతోటి సువర్ణ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలల సైన్స్ కాంగ్రెస్‌లో వడ్డీవారిపాలెం విద్యార్థినుల ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థినులు

రేపల్లె రూరల్: బాపట్లలోని బీవీ అండ్ బీఎన్ గవర్నమెంట్ హైస్కూలులో ఈ నెల 16న జిల్లా స్థాయిలో నిర్వహించిన 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో వడ్డీవారిపాలేనికి చెందిన శ్రీమతి సావిత్రి గణేష్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. శ్రావ్య, హారిక రూపొందించిన హనీ బీ ట్రాన్స్‌ఫార్మింగ్ టెక్నాలజీ ప్రాజెక్ట్ పోటీలలో ద్వితీయస్థానం సాధించింది. రాష్ట్రస్థాయి ప్రదర్శనకు అర్హత సాధించారు. తేనెటీగల ద్వారా జీవకీటక నాశనులను పంట పొలాల్లో వ్యాప్తి చేయించుడం ద్వారా రసాయనిక పురుగు మందులను వాడకుండానే వివిధ రకాల పంటలలో వచ్చే చీడపీడలను నిర్మూలించటం, క్రిమి సంహారిక మందుల అవశేషాలు లేని నాణ్యమైన పంట ఉత్పత్తులను సాధించడం, పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టటం ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశ్యం. ప్రాజెక్టుకు గైడ్‌గా వ్యవహరించిన బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు లచ్చి కోటేశ్వరరావును, విద్యార్థులను స్థానిక స్కూల్ ఆవరణంలో శనివారం ప్రధానోపాధ్యాయురాలు బి.మాధవి ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 29, 30తేదీల్లో రాష్ట్రస్థాయిలో వడ్డేశ్వరంలోని కేఎల్‌యూ యూనివర్సిటీలో నిర్వహించే పోటీలలోనూ ప్రతిభకనపరచాలని కోరారు.

26న ఆర్యవైశ్య సంఘాల కార్తిక వన సమారాధన



ఆహ్వానపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఈనెల 26న ఆర్యవైశ్య కార్తిక వన సమారాధన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శనివారం ఆవిష్కరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, అనుబంధ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో దేవస్థానం ప్రాంగణంలో నిర్వహించనున్న వనసమారాధన వివరాలను పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భాస్కరుని శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘాల కో–ఆర్డినేటర్ మద్దాళి శేషాచలం వెల్లడించారు. ఆరోజు ఉదయం 11 గంటల్నుండి వన సమారాధన ఆరంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొల్లా గురునాథగుప్తా, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు కొండవీటి లక్ష్మీపద్మావతి, వాసవి సేవాదళ్ అధ్యక్షుడు చుండూరు సాయి, లీగల్ సెల్ కమిటీ అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు, ఆధ్యాత్మిక సేవ కమిటీ అధ్యక్షుడు చుండూరి వెంకట శివప్రసాద్ పాల్గొన్నారు.

భూసారం పెంపుపై వ్యవసాయ కళాశాల విద్యార్థుల అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న కళాశాల విద్యార్థినులు, శాస్త్రవేత్త డా. జి.రమేష్

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): ట్రైకోడెర్మావిరిడీ ఉపయోగించడం వల్ల భూసారం పెరుగుతుందని వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డా, జి.రమేష్ అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఆర్ఏడబ్ల్యూపీ(రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాం)లో భాగంగా బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ట్రైకో డెర్మావిరిడీ మల్టిప్లికేషన్‌పై శనివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్, శాస్త్రవేత్త రమేష్ ట్రైకో డెర్మావిరిడీ అనేది ఒక శిలీంధ్ర నాశిని, మొక్క తెగులుపై జీవ సంరక్షణ నియంత్రణ చేస్తుందని వివరించారు. వేరులో వ్యాపించే ఫంగస్ లాంటి వాటిపై ఆక్రమించి అరికడుతుందని తెలిపారు. వేరు తెగులు, వడలి తెగులు, కాండం తెగులును అధిగమించుకోవచ్చని వివరించారు. ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్ డా, సీహెచ్ వరప్రసాద్ ట్రైకోడెర్మావిరిడీ ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామ చిత్రపటాన్ని రంగులతో తయారు చేశారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు పరిష్కారం

నల్లమోతువారిపాలెం(కర్లపాలెం): రైతుల భూముల సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సంపూర్ణ భూ హక్కు, భూరక్ష స్వామిత్వ కార్యక్రమాలు నిర్వహిస్తోందని నల్లమోతువారిపాలెం సర్పంచ్ మాడా వెంకటరత్నం, ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు అన్నారు.స్థానిక గ్రామ సచివాలయంలో శనివారం సర్పంచ్ సుబ్రమణ్యం అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. రైతులు తమ పొలాల సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని చెప్పారు. భూములు, నివాస స్థలాల మధ్య సమస్యలను పరిష్కరించి శాశ్వత భూహక్కు, భూరక్ష కల్పించేందుకు అధికారులు దోహదపడతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న వైస్ ఎంపీపీ

కొల్లూరు : బాల్య వివాహాల కారణంగా బాలికలు ఆరోగ్య పరంగా తీవ్ర అనర్థాలకు గురవుతారని వైస్ ఎంపీపీ మురాల రాంబాబు అన్నారు. శనివారం కొల్లూరు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నతనంలో పెళ్లిళ్లు చేసుకోవడం వల్ల జరిగే నష్టాలను విద్యార్థినులకు వివరించారు. బాల్య వివాహాల కారణంగా చోటు చేసుకునే పరిణామాలపై విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వివరించి, అవగాహన కల్పించడంతో పాటు, తమ పరిధిలో బాల్య వివాహాలు జరుగుతున్న పక్షంలో అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ కొల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

వేమూరు: మండలంలోని శనివారం వేర్వేరు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. బూతుమల్లి, జంపని మార్గంలో తెనాలి నుంచి వేమూరుకు ద్విచక్ర వాహనంపై భార్య భర్తలను మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వారికి గాయాలైనట్లు ఎస్ఐ జె.నాగారాజు తెలిపారు. అలాగే.. తెనాలి నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ఇద్దరిని వేమూరు గ్రామం సమీపంలో కారు ఢీ కొట్టడంతో వారు గాయపడ్డారు. వీరు అబ్బనగూడవల్లి గ్రామానికి వ్యక్తులుగా గుర్తించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్య శాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు సర్రాజు స్మారక 'యశస్వి' పురస్కారాల ప్రదానం

గుంటూరు వెస్ట్: సర్రాజు వేణుగోపాలరావు స్మారక 'యశస్వి' పురస్కారాల ప్రధానోత్సవాన్ని ఆదివార సాయంత్రం 7 గంటలకు స్థానిక లక్ష్మీపురంలోని త్యాగరాజ సాంస్కృతిక సంఘంలో నిర్వహించనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు సర్రాజు బాలచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యుత్తమ విలువలతో ఉపాధ్యాయ వృత్తికే గౌరవం తెచ్చిన గోపాలరావు పేరుతో ఏటా తమ కుటుంబ సభ్యులు ప్రతిభగల కొందరిని ఎంపిక చేసి యశస్వి పురస్కారంతో సత్కరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది అవార్డులను నాటక రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, ఎంపీయూపీఎస్ లేమల్లెపాడు ప్రధానోపాధ్యాయుడు పసుపులేటి శ్రీధర్, చలనచిత్ర దర్శకుడు ఎస్.వై. గౌతం రాజులకు అందజేస్తామని తెలియజేశారు.

నాగమ్మతల్లికి విశేష పూజలు



అన్నదానంను ప్రారంభించిన జెడ్పీటీసీ సభ్యుడు వేణుగోపాల్‌రెడ్డి

కర్లపాలెం: కర్లపాలెం పంచాయతీ ఎంపీ రాజుపాలెం గ్రామంలోని నాగమ్మతల్లి పుట్ట వద్ద శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రతిష్ట వార్షికోత్సవంలో భాగంగా భక్తులు పసుపు కుంకుమ, పూలు, పండ్లు సమర్పించి, పుట్ట వద్ద పాలుపోసి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యులు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు.

దళితులకు అండగా ఉంటా

ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం. విక్టర్ ప్రసాద్



ప్రత్తిపాడు: దళితులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని, ధైర్యంగా ఉండాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం. విక్టర్ ప్రసాద్ అన్నారు. వట్టిచెరుకూరు అయ్యన్నగుంటపల్లెలో కొద్దిరోజుల కిందట దళిత యువకుడు గేరా సందీప్ అనుమానస్పద స్థితిలో మృతి చెందడం, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును పోలీసులు నమోదు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో సందీప్ కుటుంబాన్ని శనివారం రాత్రి ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పరామర్శించారు. సందీప్ తల్లి, కుటుంబ సభ్యులతోతో మాట్లాడారు. వారి ఓదార్చారు. అసలేం జరిగిందన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరిహారంగా నగదును ఇవ్వడం జరుగుతుందని, అంతేకాకుండా ఇంటి స్థలంతో పాటు సందీప్ సోదరుడికి ఉద్యోగం, తల్లికి పింఛను కూడా వస్తుందని ఈ మేరకు చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. దళితులకు న్యాయం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. ఆయన నాయకత్వంలో పూర్తి న్యాయం చేస్తామని విక్టర్ ప్రసాద్ చెప్పారు. సీఎం జగన్ మాటలను మాత్రమే నమ్మాలని సూచించారు. వెంట గుంటూరు ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ, తహసీల్దార్ తదితరులున్నారు.

మెనూ.. ఖచ్చితంగా అమలు కావాల్సిందే

- ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి. ఖాసీం



విద్యార్థులు గీసిన చిత్రాలతో ఉప తనిఖీ అధికారి ఎం.డి. ఖాసీం

ప్రత్తిపాడు:ప్రభుత్వం నిర్దేశించిన జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారం కచ్చితంగా విద్యార్థులకు భోజనం అందించాలని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి. ఖాసీం ఆదేశించారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలతో పాటు ప్రత్తిపాడు మండలం గనికపూడిలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను శనివారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పుల్లడిగుంట పాఠశాలలో పాఠశాలలో నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులు గీసిన రంగురంగుల చిత్రాలను పరిశీలించి, వారిని అభినందించారు. అనంతరం గనికపూడి పాఠశాలలో జగనన్న గోరుముద్ద మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. భోజనం విషయంలో రాజీ పడవద్దని, నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని విద్యార్థుకు అందించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. నిత్యం భోజనం నాణ్యతను పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయించవద్దు

తెనాలిఅర్బన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించిందని, వాటిని ఎవరు ఉపయోంగిచడం కానీ, అమ్మడం కానీ చేయవద్దని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, ఎం.సుబ్బారావు పేర్కొన్నారు. పట్టణంలోని గాంధీచౌక్‌లో శనివారం పలు దుకాణాలను తోపుడుబళ్లను తనిఖీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న పలువురు వ్యాపారులకు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాసం కొనుగోలు చేసే వారు తప్పని సరిగా స్టీల్ బాక్స్‌లు ఉపయోగించాలని సూచించారు. అలాగే క్లాత్, జానపనార సంచులను ఉపయోగించాలని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ వి.రవీంద్ర, ఎస్.బాబూరావు, వి.విజయచంద్ర, టి.సుష్మ, కె.నాగజ్యోతి పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన



పాఠశాల విద్యార్థులతో కళాశాల విభాగం

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ కళాశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు నగరంలోని శ్రీ విజేత హైస్కూల్, జిల్లా పరిషత్ ఉర్దూ హైస్కూల్స్‌లో ఎనిమిది, తొమ్మిది తరగతుల విద్యార్థులకు విభాగాధిపతి డాక్టర్ జి.మురళి, ఐఐసీ కన్వీనర్ డాక్టర్ ఎస్.నాగేంద్రం, ఇన్నోవేషన్ కో–ఆర్డినేటర్ జాన్ సైదాలు అవగాహన కల్పించారు. రానున్న రోజుల్లో సమాజంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏఏ రంగాలను ఎలా ప్రభావితం చేస్తుంది, అధునాతన టెక్నాలజీ ద్వారా కలిగే ప్రయోజనాలు, ఎదురయ్యే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల డైరెక్టర్ శ్రీ చెరుకూరి శ్రీహరి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థినీ విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు దోహదపడతాయన్నారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు చేసేందుకు ముందుకు వచ్చే విద్యార్థులకు తమవంతుగా ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ కె. హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ముప్పలనేని విశేష కృషి

బాపట్ల: సమాజ సేవలో ముప్పలనేని శేషగిరిరావు విశేష సేవ చేశారని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. బాపట్ల స్థానిక జీబీసీ రోడ్డులోని సుమంత్ బయో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ స్మృతి వనంలో ముప్పలనేని శేషగిరిరావు నాలుగో వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుమంత్ బయోటెక్నాలజీస్ నిర్వహించిన లక్కీ డ్రాను ఎమ్మెల్యే కోన చేతుల మీదుగా తీయించారు. మొదటి బహుమతి డి. సుబ్బారెడ్డికి సాంసంగ్ టీవీ, రెండవ బహుమతి ఎం.బ్రహ్మరెడ్డి గ్రైండర్, మూడవ బహుమతి జి. గౌతమ్‌రెడ్డికి మిక్సీ గెలుపొందారు.